# మాతృవందనం

## యామినీ సరస్వతి

తెల్లవారుఝామున అయిదింటికి ట్రెయిన్. రాత్రి పడుకునే ముందు ఎలక్ట్రానిక్ వాచ్‌కి ఎలారం సెట్ చేసి పడుకున్నాడు. అయినా రెండింటికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. గొంతంతా తడారిపోతున్నట్లుగా వుంది. లేచి ఫ్రిజ్ తెరచి చల్లనినీళ్ళు గొంతులో పోసుకున్నాడు. మనస్సు నిండా ఏదో తెలియని ఒంటరితనం_ఆందోళన!

అలా చూశాడు రామచంద్రం....

హాయిగా నిద్రపోతున్నది శశికళ. ఆమెకి ఏ దిగులూ ఏ ఆలోచనలూ లేవు. నిశ్చింత అయిన జీవితం. ఒక బాధ్యతాయుతమైన గృహిణి. కొడుకు, కూతురు విషయాలు చూసుకోవటం....ఇంటి పని, వంటపని అజమాయిషీ చెయ్యటం, కాలక్షేపానికి వీక్లీలు, నవల్సూ చదవటం- నిద్ర....

నిద్ర.... నిద్ర.... అంత హాయిగా ఎలా నిద్రపోగలుగుతుంది?

మొదటి నుంచి అంతే! తొమ్మిది దాటితే కన్ను మూత పడుతుంది మళ్ళీ ఆరింటికి కానీ మెలకువరాదామెకి. ఇరవయ్యేళ్ళ సంసార జీవితంలో తనెన్నిసార్లు ఆమె అదృష్టానికి అసూయ పడ్డాడు

నిజానికి తనకీ ఏ ప్రాబ్లమ్స్ లేవు. ఎమ్మే పాసవగానే తన మెరిట్‌కి బ్యాంక్‌లో జాబ్ వచ్చింది. చీకూ చింతా ఏనాడు లేదు. సంసార బాధ్యతలు లేవు ఉద్యోగ సంబంధమైన అలజడీ లేదు. వివాహ సంబంధమైన చిక్కులూ లేవు. శశికళ తనకి అన్ని విధాలా అనుకూలవతి అయిన భార్య. తన మనస్సు తెలుసుకొని ప్రవర్తిస్తుంది.


మరి ఎక్కడుంది ఈ అలజడి!

తన మనస్సులోనేవుంది - చిన్నప్పుడు అమ్మ కూడా అలాగే అనేది. చదువుకునే రోజుల్లో తను గుంటూరు నుంచి సెలవులకి ఊరికి వెళ్ళినా ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూ వుండేవాడు చదివిన ప్రతి పుస్తకం పైన "నోట్స్" వ్రాసుకోవడం తనకి అలవాటు. నిద్ర పట్టకపోతే ఏ అర్ధరాత్రి పూటో లేచి చదువుకుంటూ వ్రాసుకుంటూ గడిపేవాడు. అది చూసి ఆమె కేకలు వేసేది.

"సెలవుల్లో నయినా హాయిగా నిద్ర పోరా నాయనా. ఏం చదువులు అవి! ఒక్క పిల్లవాడివి నలుగురు ఆడపిల్లల మధ్య రత్నంలా పుట్టేవు! ఊళ్ళేలాలా ఉద్యోగం చేయాలా! ఈ లంకంత యిల్లు. యీ వ్యవసాయం అజమాయిషీ చేసుకుంటే చాలు! ఏం జరగదా! మీ తాతగారు సుఖపడ్డారు. మీ నాన్నగారు, నేను సుఖపడుతున్నాం. నీకు సుఖంగా వుండదా! వద్దన్నా పండుతోంది భూమి!"


తను జవాబుగా నవ్వేవాడు.

నాన్నగారు పట్టించుకునే వారు కాదు కానీ అమ్మతో అనే వాడట. "కాంతం! రోజులు మారుతున్నాయి. మా నాన్నగారి హయాంలో జమీందారీదర్జా వెలిగించాడు. ఆస్తి హారతికర్పూరంలా తరిగిపోయినా అయివేజు మిగిలేదికాదు. మనుషులు తెలివి మీరుతున్నారు. పల్లెటూళ్ళు నాగరికత సంపాదించుకొంటున్నాయి. ఆప్యాయతలూ, అనురాగాలూ నశిస్తున్నాయి అంతటా స్వార్థం స్వైరం! అసూయ పెచ్చుపెరిగిపోతూంది. కల్మషం కమ్ముకొస్తోంది. ఇలాగే పల్లెలుపాడైతే....ప్చ్....ఏం చెప్పలను! దేశమే పాడైపోతుంది. మనం వున్నట్లుగా అబ్బాయి యిక్కడ యిమిడిపోలేడు. వాడిని ఉద్యోగం చేయనీ" అన్నారట.



వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. వరుసగా అన్నీ శుభాలే జరుగుతున్నాయి ఉద్యోగంలో చేరిన ఆరునెలలకే శశికళతో పెళ్ళయిపోయింది. ఆమెకి మేథమేటిక్స్ బాచిలర్ డిగ్రీ ఉంది ఉద్యోగం చేయమన్నాడు తను. చదువు కాలక్షేపానికి కాదు అనేది తన నమ్మకం.

"ఊహుం! నేను కాలక్షేపానికి చదువుకున్నాను అందుకే ఆర్ట్స్ తీసుకోకుండా సైన్స్ తీసుకొన్నాను. అందునా మేథ



మేటిక్స్. ఒక్క క్షణం వ్యర్థం చెయ్యకుండా విద్యార్థి జీవితం గడపాలనుకుంటే లెక్కలు చదువుకోవాలి" అందామె.

"నీ ఇష్టం!" అన్నాడు తను. అమ్మకి ఎలాగూ ఇష్టం వుండదు. అంచెలంచెలుగా ప్రమోషన్. పదేళ్ళకే తను బ్రాంచి మేనేజర్ అయ్యాడు. పెళ్ళయిన నాలుగేళ్ళలోనే కొడుకూ, కూతురూ పుట్టారు. శశికళ ట్యూబెక్టమీ చేయించుకుంది.

ఆ విషయంలో కూడా అత్తా కోడళ్ళకి అభిప్రాయాలు కుదరలేదు. కానీ నాన్నగారికి ఇతర్ల అభిప్రాయాలని గౌరవించే మంచి లక్షణం తొలినుంచే వుంది. అందుకే తను ఉద్యోగానికి అంకితమైపోయాడు.

ఉద్యోగం తనని వూరూరా తిప్పింది. రకరకాల మనుషులు, రకరకాల ప్రవృత్తులు ఈర్ష్య అసూయలతోపాటు ఆత్మీయత అనురాగం కూడా చవిచూశాడు తను. కానీ రానురానూ వున్నఊరికే అంకితమైపోయాడు. కన్నతల్లికి పుట్టిన వూరికీ దూరమవుతూ వచ్చాడు.

ఆఖరికి నాన్నగారిని కడసారి చూపు చూసుకునే అదృష్టం కూడా లేకపోయింది. తను బ్యాంక్ పనిమీద ఢిల్లీ వెళ్ళాడు. ఫైనాన్స్ కమిటీ మీటింగ్‌లో ఏవో పేపర్స్ సబ్మిట్ చేయవలసిన పని వుంది. తన రీజనల్ మేనేజర్ వెళుతూ తనని వెంట తీసుకెళ్ళారు. "రావ్! హై అఫీషియల్స్‌తో పరిచయాలు జీవితంలో ఎంతో ఉపకరిస్తాయి" అన్నారాయన. తను ఢిల్లీ

తన మనస్సులోనూ అదే ఆలోచన వుండేది.

కానీ అమ్మకి యిష్టం వుండేది కాదు. బియ్యేలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాడు తను. గోల్డ్ మెడల్ అందుకొని ఇంటికి వెళ్ళాడు. దాన్ని నాన్నగారు తీసుకుని అమ్మ మెడలో వేశారు! "నీవు వీరపత్నివే అనుకొన్నాను. వీరమాతవు కూడా! కాంతం! యోగ్యుడైన కొడుకు పుట్టటం గృహవిశేషం....నువ్వు నన్ను అదృష్టవంతుడిని చేశావు కాంతం"

ఆ మాటలు తనకు ఎంతో గర్వాన్ని కల్గించాయి.

ఎమ్మే ఫైనలియర్‌లో వుండగా బ్యాంక్ ఎగ్జామ్స్ రాశాడు! నాన్నగారికి తనని కలెక్టర్ని చేయాలని వుండేది. ఐ.ఏ.యస్. సెలక్షన్స్‌లో జరిగే ఫార్సు గురించి తనకి తెలుసు. "నువ్వు ఢిల్లీ వెళ్ళు. రావ్స్ ట్యుటోరియల్స్‌లో కోచింగ్ తీసుకో. తప్పక ఐ.ఏ.యస్. అవుతావు" అన్నారాయన.

"అమ్మో! ఢిల్లీకా! అంతదూరం వద్దు. ట్రయినింగ్‌కి ఎక్కడికో పంపుతారు కలెక్టర్‌గా దేశంకాని దేశం పంపిస్తారు. వాడిని విడిచి వుండలేను. రామా! నీకు ఉద్యోగం వద్దు ఏమీవద్దు. లక్షణంగా లక్షణవతి అయిన అమ్మాయిని చూసి పెళ్ళిచేస్తాం. ఇంటిపట్టున వుండిపో" అంది అమ్మ.

తను అటు నాన్నగారి మాట వినలేదు, అమ్మమాట వినలేదు. ఫైనలియర్ పరీక్షలు పూర్తి చేసుకుని వూరికి వచ్చిన వారం రోజులకే తనకు స్టేట్ బ్యాంక్‌లో సెలక్షన్ వచ్చింది వెళ్ళి చేరతానన్నాడు. నాన్నగారేం అనలేదు. అమ్మమాటకూడా వనిచేయలేదు.

## ప్రేమ కవిత్వం

"ప్రేమించాలంటే ముందు
అడుగుజాడలు పడకుండా
తడి ఇసకలో పరిగెత్తు"
అని ఓ టర్కిష్ సామెత.

కాని,

తొలి ప్రేమలో ఎవరికైనా
తప్పటడుగులు తప్పవు మరి.
పాదముద్రల విన్యాసం
పదిమందీ చూడకా తప్పదు :

కొన్ని లోతుగా గాయాల్లా
కొన్ని సల్లగా మచ్చల్లా
కొన్ని మరపులా చెరిగిపోతూ.

నా ప్రేమ కవితలు
నా పాదముద్రలు.

—కె. గోదావరిశర్మ

వెళ్ళిన మూడోరోజే నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చి పోయారు.

టెలిగ్రాం అందుకున్న శశికళ ట్రంకాల్ చేసింది. హడావిడిగా ప్రయాణమై ఫ్లైట్‌లో వచ్చి. అక్కడ నుంచి కారులో తమ ఊరికి నలుగురూ వెళ్ళేరు. ఏం చూశాడు తను! నిర్వికారంగా నిశ్చింతగా అరవై సంవత్సరాల జీవితం గడిపి హాయిగా కన్ను మూసిన ఓ సంతృప్త జీవి. శరీరం.... అంతే — ఒక మాటలేదు.... ఒక చూపులేదు.

అప్పుడే తన గుండెల్లో ఏదో సన్నని రొద మొదలైంది. అది ఈ నాటికీ అప్పుడప్పుడూ గాలి తాకిడికి శృతి చేసిన వీణ అసంకల్పరాగాన్ని పలికినట్టుగా ఘోష పెడుతూనే వుంది.

ఇప్పుడు మళ్ళీ అవ్యక్తాందోళన.... మొన్ననే తల్లి నుంచి జాబు వచ్చింది. బరువు నుంచి విశ్రాంతి కోరుతుంది మనస్సు. ఈ రెండు రోజులూ అన్నీ తెమల్చుకొని వారం రోజులు సెలవు పెట్టి ఊరికి ప్రయాణమయ్యాడు. యాంత్రిక జీవితానికి అలవాటు పడ్డాడు. తను ఉద్యోగం.... పుస్తక పఠనం.... మరో వ్యాపకం లేదు.... తీరికలో శశితో కబుర్లు.

ప్రశాంతమైన సరోవరంలో చిన్న మట్టిబెడ్డ పడి కొలనంతా కదలిపోయినట్లుగా మొన్న వచ్చిన ఉత్తరం తనమనస్సుని కలవర పరచింది. నైట్ గవున్‌లో దాచుకున్న ఉత్తరాన్ని తీశాడు రామచంద్రం. ఈజీ చెయిర్‌లో వాలిపోయాడు. టేబుల్ లైట్ వెలిగించి చదువుకోసాగాడు. అది పదవసారి చదవటం.... అయినా క్రొత్తగా వింతగా ఎదలోయల్లో ప్రశాంతంగా ప్రవహించే ప్రేమ ప్రవాహాన్ని కదిలించేట్టుగా ఉంది

దాదాపు ఇరవై సంవత్సరాలుగా ఒక విధమైన జీవితానికి అలవాటుపడ్డ రామచంద్రకి. ఆ ఉత్తరం కొత్త ద్వారాన్ని తెరచినట్లుగా వుంది. నలభియేళ్ళు మామూలుగా బ్రతికి అప్పుడు. అకాల వసంతంలాగా ప్రేమానుభవాన్ని పొందిన వ్యక్తిలా అయింది. గుండె గుడిలో గూడు కట్టిన ప్రేమ మాతృరాగానికి కదలి ప్రవహించినట్టుగా అనుభూతి. ఏదో జన్మలో చిరతపస్సుకు ఫలితంగా పొందిన దివ్యానుభూతిని తిరిగి యిన్నేళ్ళకి తట్టి లేపినట్టుగా వుంది. అతని కళ్ళు అక్షరాల వెంట పరిగెడుతున్నాయి

కన్నా!

ఎన్నేళ్ళయిందిరా నిన్ను చూసి!

తలుచుకుంటే ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లుగా వుంటావు. అయిదేళ్ళనాడు రమ కూతురి పెళ్ళికి వచ్చావు. అంతే. మళ్ళీయిక రానేలేదు. కానక కన్న సంతానంలాగా నిన్ను నలుగురమ్మాయిల మధ్య కనుపాపలాగా చూసుకొని పెంచుకున్నాను నిన్ను యిల్లు దాటి వెళ్ళనివ్వలేదు. ఆ చదువుల సరస్వతి నిన్ను వెంటేసుకు వెళ్ళింది. అంతా చదువుకొన్నవాళ్ళేనా! నా కన్న చదువుకొనక పోతేనేం సంస్కారం వచ్చింది. చదవనూ రాయనూ నేర్చుకున్నాడు చాలు. వద్దు.అన్నాను. వినలేదు. తరువాత ఉద్యోగలక్ష్మి ఊళ్ళేలిస్తోంది. ఎక్కడున్నా నువ్వు నా కొడుకువే నువ్వు. నీ సారస్వత సంఘాలూ, నీ సాంఘికసేవలూ అన్నీ పేపర్లద్వారా కోడలి ఉత్తరాల ద్వారా తెలుస్తూనే వున్నాయి.

కానీ ఏం లాభంరా తండ్రీ!

నువ్వూ నీ పిల్లలూ యింట్లో కాలికి చేతికి అడ్డంగా తిరుగుతూ ఉంటే. కోడలి చేత్తో చేయించిపెడుతూవుంటే సాగిపోయే జీవితం ఎలా వుంటుంది? ఏమో! అది నాకు 'కల' అయిపోయిందిరా బాబూ! ఇంత యిల్లు! ఒంటరిగా బతుకుతున్నాను. నా కెంత కావాలి? పిడికెడు ఉడకేసుకుంటే చాలు.... వెళ్ళిపోతుంది కానీ. అసక్తి పోయింది. ఎలా తింటే కడుపు నిండదు! అలాగే నడుస్తోంది.

జీవితంలో పొద్దువాటారిపోతోంది. ఇంకెన్నాళ్ళు అవిపిస్తోంది! మీ నాన్నగారూ హఠాత్తుగా పోయారు. నీకు కడసారి చూపులు కూడా దక్కలేదు. అప్పుడాయన దగ్గర్లో నేనున్నాను. గొంతుకలో గొరగొరలాడుతున్నపుడు నేను యిన్ని నీళ్ళు పోశాను. నా దిగులల్లా అలా నాకు జరిగితే ఈ గొంతులో యింత తులసి తీర్థం పోసేవాళ్ళు కూడా వుండరేఅని!నలుగురు కూతుళ్ళు ఒక కొడుకు. పండెడుగురు మనుమలు. మనవరాళ్ళు వున్నా నా గొంతు తడిపేవాళ్ళు వుండరేమో అని దిగులుపడుతున్నాను.

నువ్వు నన్ను అక్కడికే రమ్మని అంటావు. నిజమే వచ్చేయొచ్చు కానీ రాలేను! రాను! ఈ యిల్లు యీ పొలాలు. యీగాలి. యీ వాతావరణం వీటిని వదలి రాలేను. మీ నాన్నగారు యిక్కడే పోయారు.నేను యిక్కడే పిడికెడు బూడిదైపోవాలి అదే నా ఆశ!

ఈ మట్టికీ మనిషికీ ఉండే ఆత్మీయత అదేనేమో! ఎంత చదివినా. ఎంత సాధించినా.ఏంచేసినా ఆఖరికి మనిషి ఈ మట్టిలో కలిసిపోవాలి. అలానే ఆ మట్టి తనను కన్న వూరి మట్టి కావాలని ఆరాటపడతాడు మనిషి. ఇది నా వూరు. యిది నా యిల్లు. ఇది నాది....యీ మమతానుబంధాలు లేనిరోజున మానవత్వమే నశిస్తుందేమో! అందుకే అనాదిగా యీ మమకారాలు యిలాగే నిలిచిపోయాయి. రాజులు పోయారు. రాజ్యాలు పోయాయి. మహామహా నిర్మాణాలు మట్టిచాటుకుపోయాయి.కానీ మానవత మాసిపోలేదురా బాబు! అందుకే యీ ప్రపంచం యింకా సాగుతోంది.

నేను అంత దూరం రాలేను. ఈ వూరు విడవలేను. ఈ ప్రాణం తట్టెడా? పుట్టెడా? ఎప్పుడో హరీ అంటుంది. నాకు

తెలుసు. నాది ఎలాగు దిక్కులేని దావే అవుతుంది. ఎప్పుడయితే ఆయన పోయారో—అప్పుడే నేను ఒంటరిదాన్నై పోయాను. కానీ పోయేలోగా నువ్వు యిక్కడికి వచ్చి నాలుగురోజులు గడిపిపో—కన్నతల్లిగా నేను అంతకంటే యింకేమీ కోరను కోడలిని పిల్లలని కూడా తీసుకురా! ఇక వుంటాను. ఆశీస్సులతో

నీ తల్లి

—కాంతమ్మ

చెమర్చిన కళ్ళని తుడుచుకున్నాడు రామచంద్ర.

"అప్పుడే లేచారా?"

శశికళ ప్రశ్నకి ఉలికిపడ్డాడతను. "ఊఁ"

"టైం ఎంతయింది?"

"మూడు కావొస్తోంది."

"ట్రెయిన్ అయిదింటికి కదా?"

"అవును—"

శశికళ లేచింది— బాత్‌రూంకి వెళ్ళొచ్చింది.

బ్రష్‌పై పేస్టు వేసి తెచ్చింది బ్రష్ చేసుకోసాగాడు.

రామచంద్ర ఏదో ఆలోచిస్తున్నాడు.

"అయిదు రోజులే సెలవు పెట్టారు కదా?"

"ఆ"

"ఓ నెలనాళ్ళు సెలవు పెట్టేసి ఆ యిల్లు అద్దెకిచ్చి పొలాలన్నీ కౌలుకిచ్చి అత్తగారిని తీసుకరండి అంటే వినరు. మీరు ఉద్యోగాన్ని విడిచి వుండలేరు. మీకు ఉద్యోగం మొదటి పెళ్ళాం. నేను రెండో దాన్ని."

నవ్వేడతను— "తప్పు. నువ్వే చెప్పావు — ఇంకొకరున్నారు —"

క్షణంలో సగం — నవ్వింది శశికళ. "అవును-పుస్తకాలు. మూడోది నా స్థానం.... ఇద్దరు సవతుల్లతో వేగుతున్నాను."

"అయినా అత్తగారంటే అంత అభిమానమైతే నువ్వూ రారాదూ."

"ఎలా వచ్చేది?"

"ఏం?"

"మంజుకి ఎగ్జామ్స్ — ప్రియతమ్ ఈ ఆదివారం వస్తానని రాశాడు. వాడొచ్చేసరికి యిద్దరూ లేకపోతే యెలా?"

"వచ్చాక ఎలాగూ వుంటారు కదా! మంజు ఎగ్జామ్స్ రాస్తుంది. ఏం భయం లేదు. మనం వెళ్ళి రావొచ్చు ఒకటి రెండు రోజులు ఆలస్యమయినా నే వచ్చేస్తా. మీరిద్దరూ కలిసి రావొచ్చు."

శశి సమాధానం ఇవ్వలేదు

రామచంద్ర స్నానానికి వెళ్ళేడు. శశికళ కిచెన్‌లోకి వెళ్ళి మరో అయిదు నిమిషాల్లో కాఫీ కలుపుకొని వచ్చింది. బాత్‌రూం నుంచి తిరిగివచ్చిన రామచంద్ర కాఫీ తాగేడు.

"బావుంది."

"ఏమిటి?"

"కాఫీ—వెరీ ఫైన్"

"రోజూ తాగేదే కదా?"

"రోజు తిన్నన్నమే తింటున్నాం— తాగుతున్న నీరే తాగుతున్నాం. చేస్తున్న సంసారమే చేస్తున్నాం- రోజూ అదే దారిపోడి. అదే నీళ్ళు అయినా రోజురోజుకో రుచి. జీవితం నవనవోన్మేషమైంది. అందుకే రుచి కనపడుతుంది-జీవితంపై ప్రేమపుడుతుంది—"

శశికళ జవాబుగా నవ్వేసింది.

అంతలో మణిమంజూష వచ్చింది. "గుడ్ మార్నింగ్ డాడీ" అంటూ తండ్రి భుజాలపై వాలిపోయింది.

"గుడ్ మార్నింగ్! అప్పుడే లేచా వేమమ్మా!"

"ఎగ్జామ్స్ కదా! అందులో నువ్వు వూరెళుతున్నావాయె. మళ్ళీ వారానికి కానీ రావు. ఎలా డాడీ?"

నవ్వేశాడు రామచంద్ర.

"నాకూ భలే కోపంగా వుంది డాడీ! మీరు ప్రయాణం యింకో నెల ఆగి పెట్టుకోరాదూ! నేనూ వచ్చేదాన్ని! నానమ్మని చూసి ఎన్నేళ్ళయింది. పూర్ నానమ్మ,ఒక్కతీ ఆ పల్లెలో ఎలా వుందో ఏమో! ఎలా పాసవుతుంది టైం! వ్వ!"

"పోనీ తోడుగా నువ్వెళ్ళి వుండరాదుటే" అంది శశికళ.

"ఓ మై గాడ్! ఆ పల్లెటూళ్ళోనా! ఒక సినిమా లేదు-ఒక పార్కు లేదు-ఒక లైబ్రరీ లేదు. బయటకు వెళ్ళేందుకు ఒక స్పాట్ లేదు. పొద్దెలాపోతుందో?"

"పొలాలన్నీ తిరిగొస్తేసరి"

"ఒక్కరోజు-రెండు రోజులు-తర్వాత-"

"తిరిగిన పొలాలే తిరిగేది. చూసిన తోటనే చూస్తే సరి."

"పో డాడీ, బోర్‌కొట్టదా?"

"ఇక్కడ నువ్వు చూసిన పార్కే చుట్టం లేదా!"

"డాడీ పార్కుకి నిమిష నిమిషానికి అందం మారుతూ వుంటుంది. గంట గంటకి మనుషులు మారుతూ వుంటారు- ఇక్కడ లైఫ్-అక్కడి లైఫ్-డోంట్...డాడీ! అసలు మీరు వుండగలరా అక్కడ?" సూటిగా ప్రశ్నించింది మంజూష.

"మై గుడ్‌నెస్! అక్కడా" అనుకుని నవ్వేశాడు.

మరో అరగంటకి టాక్సీలో స్టేషన్‌కు వెళ్ళిపోయాడు రామచంద్ర.

* * * *

రాత్రంతా రైలు ప్రయాణం. స్టేషన్‌లో స్నానంచేసి క్యాంటీన్‌లో టిఫిను ముగించుకుని బస్టాండుకు వచ్చి బస్సెక్కాడు. ఆరు గంటల ప్రయాణం తర్వాత మిట్టమధ్యాహ్నం వేళకు ఆ వూరిలో దిగాడు. అక్కడ బస్టాండులో లంచ్ ముగించుకొన్నాడు. హోటల్ మెతుకులయినా ఆ బియ్యం, ఆకుకూరలు ఎంతో రుచికరంగా అనిపించాయి.






బస్టాండులో చింతచెట్టు క్రింద నుంచున్నాడు రామచంద్ర. తనవూరికి బస్సులేదు యిన్నేళ్ళయినా! ఊరూరికీ బస్సు వథకంలో కూడా తన వూరికి బస్సు రాలేదు. పబ్లిక్ టాక్సీలే తిరుగుతున్నాయి. చెప్పడానికీ ఆచరణలో చూపేదానికీ ఎంత తేడా! ప్రభుత్వంది తప్పు కాదు. పాలకులదీ తప్పు కాదు. ఎలక్షన్ సమయంలో మాటల తీపిదనానికి. మనుష్యుల గారడీకి లొంగిపోయి ఓట్లువేసే ప్రజానీకంది తప్పు.

ఎంత మాడ్చేస్తుంది. దాహం వేస్తుంది.

ఎదురుగా "చెరుకుపాల" గానుగ ఆడించి అమ్ముతున్నారు. అంతా చుట్టూచేరి గ్లాసులు గ్లాసులు ఖాళీ చేస్తున్నారు. తను వెళ్ళాలనుకున్నాడు. కానీ తనూ తన హోదా! స్టేట్ బ్యాంక్ ఎంప్లాయీ తను! డిప్యూటీ జనరల్ మేనేజర్ కాబోతాడు త్వరలో! అలాటి తను వెళ్ళి ఒక సామాన్యుడిగా అలా గ్లాసు అందుకొని 'డ్రింక్' తీసుకోగలడా!

ఏర్ కండిషన్డ్ హోటల్స్‌లో. కుషన్ చెయిర్స్‌లో ఫ్రిజ్ లోంచి తీసిన కూల్ డ్రింక్స్‌కి అలవాటుపడ్డాడు తను....

గొంతు తడారిపోతుంటే ఆగలేకపోయాడు. వెళ్ళి నుంచోగానే అతనడక్కుండానే ఓ గ్లాసు అందించాడు కుర్రాడు. ఎర్రగా సన్నని మీసకట్టులో హాలీవుడ్ హీరోలా వున్నాడు. ఇదే బొంబేలో అయితే ఏ ప్రొడ్యూసరు చూసినా నిముషాల మీద తన్నేసుకపోతాడు. లక్షలు యిస్తారు. కానీ వీడి అదృష్టం ఇలా వుంది. గానుగ తిప్పుకుంటూ చెరుకుపాలు అమ్ముకుంటూ!....

అంతలో టాక్సీ వచ్చింది

'ఎక్కడున్నారు జనం! వీళ్ళంతా ఎక్కడికి వెళుతున్నారు. ఏమిటో ఈ అంతులేని ప్రయాణాలు! ఇంత రద్దీగా జనం వున్నా యింకా నష్టం అంటారేం కార్పొరేషన్ వాళ్ళు! ఎక్కడికి పోతుంది యీ డబ్బు!'

టాక్సీ వద్దకు వచ్చాడు రామచంద్ర.

ఫస్ట్ డే ఫస్ట్‌షోకి అమితాబ్ సినిమాకి వున్నంత ఫాలోయింగ్‌గా వుంది. జనం అంతా ఎక్కేశాడు. చీమ దూరేంత సందు లేదు. అపుడే డ్రైవర్ తిరుగుముఖం ప్రయాణానికి ఇగ్నిషన్ కీ మీద చెయ్యి వేస్తున్నాడు.

హతాశుడయ్యాడు రామచంద్ర.

ఆ రద్దీలో తను వెళ్ళలేననుకున్నాడు.

"ఎక్కండిసార్! క్లీనర్ కుర్రాడు అన్నాడు."

"ఎక్కడ! స్థలం లేదు–"

"మీరురండి! ఎలాగో సర్దుకపోవాలి- ఇది తప్పితే మళ్ళీ మీకు నాలుగింటికే మేము. వెళ్ళి రావాలి-"

"షటిల్ సర్వీసా!"

వాడికి అర్థంకాలేదు తెల్లముఖం వేశాడు.

"ఇంకో టాక్సీ తిరగదా"

"ఊహూఁ ఇదొక్కటే"-

అంతలో టాక్సీ కదిలింది. అంతలో నలుగురు ప్రయాణీకులు వచ్చారు. వాళ్ళని లోపలికి తోశాడు క్లీనర్. మరో నిమిషం తర్వాత పూర్ణగర్భిణిలాగా వెళ్ళిపోయింది టాక్సీ-

ఉస్సురుమన్నాడు రామచంద్ర.

మరో మూడు గంటలు వెయిటింగ్ హారిబుల్! సమ్మర్‌లో యిలాగే నుంచుంటే తనకి సన్‌స్ట్రోక్ ఖాయం....ఎందుకు అర్థాంతరంగా పోవాలి. చప్పున బస్టాండ్‌కు ఆటువేపు వున్న కార్ల వద్దకి వెళ్ళాడు. బాడుగ మాట్లాడుకొని ఎక్కికూర్చున్నాడు! యాభయ్ రూపాయలు పోయినా ఎంత హాయి.

కారు టవున్ లిమిట్స్ దాటింది. అటూ ఇటూ బారుగా ఎదిగిన చెట్లు. ఊటీలోలాగా చల్లని గాలులు. ఎగుడు దిగుళ్ళ అక్కడక్కడావున్నా రివ్వున జారిపోతూంది అంబాసిడర్. ఆబగా చూస్తున్నాడు రామచంద్ర. దారికి అటూ ఇటూ అరటి తోటలూ. నారింజ తోటలు పంట పొలాలు. తెలుగు జీవితం ప్రతిబింబించేట్టుగా వుంది ప్రకృతి. పైరగాలి చల్లగా మెల్లగా వేస్తోంది.

ఆ ప్రాంతాలు చూస్తోంటే పులకలు రేగుతున్నాయతనికి. తల్లి ని. తల్లి భూమిని చూస్తోన్న ఆనందం పెల్లుబుకుతోంది. చిన్నతనంలో తను తిరిగిన తోటలు. పంట పొలాలు ఒకటొకటే గుర్తొస్తున్నాయి. తన హైస్కూల్‌కి. కాలేజికి. యూనివర్సిటీకి వెళుతూ చేసిన ప్రయాణాలు గుర్తుకొచ్చాయి.

కాలం గీచిన గీతలకి మార్పు లేకుండా అలాగా ఒంటరి సైనికుడిలా నిలుచుంది. క్రింద కెనాల్ నీళ్ళు తగ్గిపోయి. పేదపడిన రైతు జీవితంలాగా వుంది వెన్నెల్లో వేసవిలో అందాలు చిందే సుందరిలా నుంచున్నాయి దారి వెంబడి చెట్లు.

ఊరి ముందుకి వచ్చింది కారు. అదుగో చర్చి! అదుగో రామాలయం! అదుగో మసీదు! దారిలో ఏ మార్పు లేదు.... ఊరు మధ్యకి వచ్చింది కారు.

రామచంద్ర సూచన మేరకు కారు యింటి ముందుకి వెళ్ళింది. పురాతన కట్టడంలా ఒంటరిగా నుంచుంది మేడ! రామచంద్ర గుండెల్లోంచి ఏదో ఆత్మీయత. ఏదో మమతానుబంధం తన్నుకొని వచ్చింది.

గేటు కిర్రుమని చప్పుడు చేసింది. పాతబడటంవల్ల. వసారాలో మంచంపై పడుకుని అధ్యాత్మ రామాయణం కీర్తనలు పాడుకుంటున్న కాంతమ్మగారు గేటు చప్పుడుకి అటు చూశారు.

"అమ్మా!"

తొలిసారిగా శిశువు కేక వేసినట్టుగా పిలిచాడు. ఆమెని చూడగానే.

"రామా!"

ప్రేమ స్వర తరంగితమై రసరమ్యమై తలపు పిలుస్తుంది.

చప్పున వెళ్ళి పాదాభి వందనం చేశాడు.

అతన్ని అక్కునచేర్చుకుని ప్రక్కన కూర్చొపెట్టుకుంది.

కారు వచ్చింది చూసిన జనం. వాళ్ళ చుట్టు ప్రక్కలవాళ్ళు అంతా బిలబిలా వచ్చేశారు. రకరకాలుగా ప్రశ్నిస్తున్నారు. శశికళను గురించి. మంజూషను గురించి. ప్రియతమ్ గురించి అడుగుతున్నారు. ఆ జవాబులే తనకీ అన్నట్టుగా పట్టుకున్న చేయి విడవ

కుండా ఆప్యాయంగా నిమురుతూ వింటూంది కాంతమ్మ.

కొడుక్కి తాగేందుకు నీళ్ళు, తినేందుకు టిఫిన్ ఇవ్వాలని కూడా తోచలేదు ఆమెకి. ఆనందంతో అలాగే వుండిపోయింది.

"అమ్మయ్యా! అయ్యకు మంచినీళ్ళివ్వవా?" ఎవరో అన్నారు. కాంతమ్మ లేచింది.

ఆమె వెంట రామచంద్ర కూడా లేచాడు.

గడప దాటుతూ వుంటే తొలిసారిగా ఉద్యోగం వచ్చినప్పుడు బ్యాంక్ గడప దాటిన వేళ కలిగిన అనుభూతి గుర్తుకొచ్చింది. ఇల్లంతా మాసిపోకపోయినా గోడలు పాతబడిపోయాయి. ఎంత వెల్లవేయించినా యింకా వృద్ధాప్యం కనిపిస్తోనే వుంది. కాంతమ్మగారు కూడా బాగా తగ్గిపోయారు. మనిషిలో అలసట, బలహీనత కనిపించకపోయినా వృద్ధాప్యం కనిపిస్తోంది.

కుండలో నీళ్ళు గ్లాసుతో ముంచి యిచ్చింది. కంచుగ్లాసు! నీళ్ళు ఫ్రిజ్‌లో కంటే చల్లగా ఉన్నాయి.

"వానాకాలంలోకొన్న ముంత. అందుకే చల్లగా వున్నాయి" అందామె. సున్ని వుండలు, కారపూస, కజ్జికాయలు, జంతికలు, చక్రాలు ఒక్కొక్కటే తెచ్చి ప్లేటులో పెట్టింది.

కట్‌లెట్స్, ఆమ్‌లెట్స్, రసగుల్లాలు, బాదుషాలు తిన్న రామచంద్రకి మళ్ళీ తన తెలుగు తిండి గుర్తుకొచ్చింది. ఒక్కొక్కటే ఆప్యాయంగా ఆబగా తినసాగాడు.

"శశి బావుందా? మంజూ చదువు, అయిపోతుందా! వాడెప్పుడొస్తాడు. రామా! అందరూ రాకూడదట్రా! మళ్ళీ చూస్తానో, లేదో-"

"అమ్మా" ఆ మాట వినలేనట్టుగా అన్నాడు.

"అవును నాయనా! పండుటాకు రాలిపోకుండా ఎన్నాళ్ళుంటుంది? మీ నాన్నగారు చెప్పేవారంట - అది కాలధర్మంట!"

"అమ్మా కొన్ని సత్యాలయినా అప్రియమైనవి చెప్పకూడదు." బాధగా అన్నాడు.

కాంతమ్మ మౌనం వహించింది.

కబుర్లు దొర్లుతున్నాయి మళ్ళీ- రామచంద్ర అక్కగారి విషయాలు. చెల్లెలి విషయాలు అడిగాడు. తను కబుర్లు చెప్పాడు.

పూజా మందిరంలో ప్రవేశించాడు రామచంద్ర.

ఆ గదిలో కళాకాంతులు క్రమేపీ తగ్గిపోతున్నట్టుగా వున్నాయి. కాంతమ్మగారి నిత్యపూజతో తృప్తి చెందినట్టులేరు దేవుళ్ళు. ఆ నైవేద్యంతో సంతృప్తిపడ్డట్టుగా లేవు సాలగ్రామాలు.

దేవుళ్ళ పటాలు మాత్రం కుంకుమ బొట్లతో పూల అలంకరణతో తృప్తి పడ్డట్టుగా కనిపిస్తాయి.

ఏదో తెలియని ఆవేదన గుండెలో గుబులు పుట్టించింది.


"బాబూ! నా తర్వాత ఈ దేవుళ్ళు ఏమౌతారా అని బాధగా వుందిరా! వీళ్ళని తీసుకెళ్ళి శుచీ మడీ లేని వాళ్ళలో పడెయ్యొద్దు. ఏ శ్రీశైలమో వెళ్ళి గంగలో కలిపెయ్!"

"అమ్మా" ఆర్తిగా పిలిచాడు.

"అవునురా నాయనా! అనాథ ప్రేత సంస్కారం మున్సిపాలిటీవాళ్ళు చేసినట్టు పూజా పురస్కారాలకి నోచుకోని దేవుళ్ళని అలాగే వదిలెయ్యకూడదు. గంగపాలు చేయాలి. గండకీ నదీ గర్భంలో పుట్టిన ఆ సాలగ్రామాలు జలగర్భంలో దాగిపోవాలి— అంతే!"

రామచంద్ర అవాక్కైపోయాడు.

"ఈ యిల్లు...." ఆమె క్షణం సేపు ఆగి అంది "పాడు పెట్టకు. ఇక్కడ సంస్కృతం పాఠశాల పెట్టాలనుకొంటున్నారు యాజులుగారు. ఆయన కిచ్చెయ్. బడికి కాబట్టి తీసుకొంటాడు. సాలగ్రామాల్ని యివ్వచ్చుగాని ఆయన దానం పట్టని మనిషి.




ఆయనెన్నెందుకు మనం భంగపరచాలి. ఇస్తామంటే తీసుకోడు. తిరస్కరించిన పాపం ఆయనకెందుకు."

తరతరలాడిపోయాడు. ఈ మనుషులకి యీ శివునికీ ఎంత లంకె! తన యింట్లో పటాలున్నాయి. శశికళ 'మాస్టారు'గారి ముందు గంటలతరబడి కూర్చొన్నట్టుగా ఉంటుంది. నిజం! ఇన్నేళ్ళు యీ యింటిని ఆశ్రయించుకొన్న యీ దేవతలు ఏమైపోతారు? ఎక్కడికి పోతారు.

"తోటలు అన్నీ తగ్గిపోతున్నాయి. మామిడితోట మీనాన్నగారు ఎంతో ప్రేమగా పెంచుకొన్నారు. అదీ ముసలిదైపోతుంది. నారింజ తోటలు పాడైపోయాయి. మెట్టపొలాలు సరైన అజమాయిషీ లేక బీళ్ళుయిపోతున్నాయి" అందామె.

'నిజమే' అనుకున్నాడు రామచంద్ర. అతనా సాయంకాలం అవన్ని చూసొచ్చాడు అమ్మ చెప్పినట్టుగానే వున్నాయి. పూలయినా కాయలైనా పోషించి ఆదరించేవాళ్ళు లేకపోతే ఒట్టిపోతాయి ఆశ్రయం యిచ్చే రాతలేకపోతే "కవి" కృశించిపోయినట్టుగా పోతాయి.

"నీయిష్టం.... అన్నీ అమ్మేస్తానంటే వద్దనను. నాదేముంది! ఒక కాలు అక్కడా ఒక కాలు యింట్లో.... ఈ కాలు ఎప్పుడో ఒకప్పుడు అక్కడ వేసేస్తుంది. జీవుడు గుటుక్కుమంటాడు. ఈ ప్రేమ యీ ఆత్మీయతా యీ అనుబంధం అంతా మట్టిలో కలిసిపోతుంది."

రామచంద్ర కళ్ళలో నీళ్ళు చిమ్మేయి. "అమ్మా" అన్నాడు బాధగా.


కాంతమ్మగారు కళ్ళు తుడుచుకున్నారు. దేవుడి మందిరం వైపు ఆదోలా చూసి కదిలారు. మరో పది నిముషాలకి రామచంద్ర కూడా బయటకి వొచ్చాడు.

* * * *

కంది పచ్చడి, తోటకూర వేపుడు, మామిడికాయ పులుసు, మునక్కాయల చారు- గడ్డ పెరుగు- తెల్లగా ముత్యాల్లా మెరుస్తున్న నెల్లూరు బియ్యమన్నం.

నాసాతర్పణంగా వుంది రామచంద్రకు. రుచి చచ్చిన నోటికి రుచి తెలిపినట్టుగా వుంది. ప్రేమ అంటే తెలీని వ్యక్తికి ప్రేమామృతాభిషేకం జరిగినట్టుగా వుంది. సౌందర్యం అంటే తెలియని మనిషికి సౌందర్య రసాధిదేవత సాక్షాత్కరించినట్టుగా వుంది.

రాత్రంతా తల్లితో కబుర్లు చెప్పుకుంటూ కమ్మగా నిద్ర




పోయాడు. అతని మనస్సులో ఏదో సంకల్పం బీజప్రాయంగా ఏర్పడింది.

*　　*　　*　　*

అర్థ రాత్రి!

హఠాత్తుగా మెళుకువైంది రామచంద్రకి.

ఏవో కేకలు! హడావిడి! జనం పెట్టే ఆర్తనాదాలు! గలగలలు.

అటు చూశాడు పక్కమీద తల్లి లేదు —

ఏమిటి చెప్మా అనుకుంటూ గేటు తీసుకొని వచ్చాడు. చల్లగాలి వీస్తున్నా వేడి సెగలు—పొగవాసనలు.

"ఏమిటీ?"

పరిగెత్తుతున్న ఓ వ్యక్తిని అడిగాడు.

"రామయ్య ఇల్లు అంటుకొంది. అందరూ వెళ్ళి ఆర్పుతున్నారు" పరిగెడుతూనే జవాబు చెప్పాడా వ్యక్తి. అతని వెంటే వెళ్ళాడు రామచంద్ర. లుంగీ, బనియన్‌తో వెళుతున్నాననేస్పృహ లేదు.

అక్కడ........

ఊరి జనమంతా అక్కడే వున్నట్టుగా వున్నారు. కొందరు కడవలతో నీళ్ళు పోస్తున్నారు. ఇంకొందరు ఇంటి పైకి ఎక్కి మంటలార్పుతున్నారు. ప్రాణ ప్రమాదం లేదు వస్తు నష్టం కలక్కుండా. పశు నష్టం కలక్కుండా. యథాశక్తిగా జనం కాపాడుతున్నారు.

ఎవరో నీళ్ళ బిందె ఇచ్చారు రామచంద్ర చేతికి! మంటల వెలుగు తప్ప వెలుగు లేదు. అప్రయత్నంగా అందుకుని బిందె మరో వ్యక్తికి అందించాడతను అంచెలంచెలుగా బిందెలు చేతులు మారుతున్నాయి. మంటలు ఆరిపోతున్నాయి.

ఒక గంటకు అగ్నిహోత్రుడు శాంతించాడు.

రామచంద్రకి చప్పున ఓ సంగతి గుర్తొచ్చింది. ఆర్నెల్ల క్రితం ఇలాగే తన డిపార్ట్‌మెంట్ ప్రక్కన ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. ఫైర్ సర్వీస్ వారికి ఫోన్ చేశారు. అంతే! ఎవరు తోడ్పడతారు? సానుభూతి లేదు. ఓదార్పు లేదు తమకి పట్టనట్టుగా తమకి సంబంధించనట్టుగా చూస్తూ వుండిపోయారు.

అక్కడికీ యిక్కడికీ ఎంత తేడా?

అక్కడ యాంత్రిక జీవనం! స్పందన లేని మనుషులు.

ఇక్కడ ఆత్మీయత ఆరాటం. అనురాగం మూర్తీభవించిన మనుషులు. ఒక మనిషికి ఆపద గ్రామ గ్రామానికి వచ్చినట్టుగా పడే అనుబంధం! ఎక్కడికెక్కడ! రాక్షసులకి, దేవతలకి ఉన్నంత తేడా.

అక్కడినుంచి వచ్చిన తర్వాత కూడా అవే ఆలోచనలు! అవే భావనలు. రాత్రి బీజప్రాయంగావున్న ఆ సంకల్పం యిప్పుడు మొలకెత్తింది.

నాలుగురోజులు గడిచిపోయాయి.

ప్రయాణమవుతున్నాడు రామచంద్ర.

"మళ్ళీ ఎప్పుడు చూస్తాను-చూస్తేను-" అందామె.

"అమ్మా!" ప్రేమగా పిలిచాడతను.

"చెప్పు బాబూ! రామచంద్రా! 'రామా' అని ప్రేమగా రోజూ యీచివరి రోజుల్లో పిలుచుకోవచ్చని ఆ పేరుపెట్టుకున్నారు. ఎంత పాపం చేసినా అజామిళుడు చివరి రోజుల్లో చివరి క్షణంలో నారాయణ అన్నందుకు ముక్తిపొందాడట! నే నెంత పాపం చేసుకున్నాను! నిన్ను రోజూ నోరారా పిలుచుకునే అదృష్టానికి నోచుకోలేదు—" ఆవేదనతో అందామె.

"లేదమ్మా లేదు" నేనే పాపం చేశాను. కన్నతల్లిని. జన్మభూమిని ఇంత దాకా గుర్తించలేకపోయాను. ఈ వూరికి వచ్చేదాకా. నాకు నా ఉద్యోగం నా బ్యాంక్‌బాలెన్స్ నేను మద్రాసులో హైద్రాబాద్‌లో కట్టించుకున్న యిల్లు. నా హోదా. నా స్టేటస్ నా సర్కిల్‌లోని మనుషులు యివే గుర్తున్నాయి. అదేలోకం అనుకున్నాను- అదే నిజం అనుకున్నాను! ఎవరిబతుకు వాళ్ళు పొరుగింటిని కూడా పట్టించుకోకుండా జీవించడమే మంచిదనుకొన్నాను.

కానీ యీ ప్రేమానురాగాలు. పొరుగు మనిషి మేలుకోసం పడే తపనలోని నిస్వార్థం చూశాక నాలో ఎంత స్వార్థం వుందో తెలుస్తోంది. నేను నా జీవితాన్ని నా గమ్యాన్ని చూసుకుని నా తల్లిని ఎంత నిర్లక్ష్యంగా చూశానో తెలుసుకున్నాను. నీ మనసు నా కోసం. నా కుటుంబం కోసం. మాతో ఆత్మీయంగా మెలగడం కోసం ఎంత తపించిందో తెలుసుకున్నాను.

"నువ్వు ఇక కష్టపడనక్కరలేదు. మనసు కష్టపెట్టుకోనక్కరలేదు. నేను యింకో ఆరు నెలలకి రిటైర్ అవుతాను. మంజు చదువు పూర్తయింది. ప్రియతమ్ కు చదువు పూర్తయి స్టేట్స్ నుంచి వస్తున్నాడు. వాడి ఇష్టం. ఎక్కడైనా సెటిల్ కానీ. మంజు పెళ్ళి చేస్తాను. నేను. శశి యిక్కడికే వచ్చేస్తాము.

ఈ ఇంటికి క్రొత్త కళ తెస్తాను. ఈ దేవుళ్ళకి పూజా పునస్కారాలు చేస్తాను. ఈ యింటిని పాడుపెట్ట నివ్వను. తోట బాగు చేస్తాను. నీ చివరి రోజులు తృప్తిగా హాయిగా గడచిపోయేలా చూస్తాను.

ఆవేశంగా అన్నాడు. సిన్సియర్‌గా అన్నాడు. ఆలోచనతో అన్నాడు.

కాంతమ్మగారి మనస్సుకి తృప్తి లభించింది. తప్పిపోయిన పుత్రప్రేమ తిరిగి దొరికినట్టుంది.

"రామచంద్రా" అంది ఆమె. ఆ నాలుగక్షరాలు మాతృప్రేమకి దర్పణం పట్టేయి. ఎనలేని తృప్తి ధ్వనించింది ఆ గొంతులో.

"అమ్మా" అన్నాడు రామచంద్ర.

యుగయుగాలుగా అనుశ్రుతంగా వస్తోన్న తల్లీకొడుకుల రాగభావన మరో మొగ్గ తొడిగింది.